# ట్రాష్... ఇదంతా అబద్ధం...

-వారణాసి రామకృష్ణ

"అవినీతి! అవినీతి!! ఎక్కడ చూసినా అవినీతి ఉందని చెప్పటం, గగ్గోలు పెట్టటం అందరికీ చాలా చాలా ఫ్యాషనైపోయిందీ మధ్య కాలంలో!

నాకు తెలీకడుగుతాను - అసలు అవినీతనేది ఎక్కడుందండి? అవినీతి లేదు! అవును... మన దేశంలో అస్సలు లేదు! ఊరకే అందరూ బాహాటంగా వాడు అవినీతిపరుడు. వీడు అమ్మో! చాలా కంత్రీగాడు! అనటమేగాని - నన్నడిగితే ఇక్కడంత మంచివాళ్ళు, నిజాయితీపరులు వేరే ఏ కంట్రీలోనూ దొరకరు గాక దొరకరు! ఏమంటారు?"

"... ... ..."

" ఏంటి? అట్లా గుడ్లప్పగించి నోరు తెరిచి చూస్తారూ? అవును! నేను చెప్పేది నిజం! ముమ్మాటికీ సత్యం!

ఒకవేళ అవినీతి అనేది మీరన్నట్టు ఊడలు దిగి ఉన్నట్లయితే, క్యాన్సరు రోగి శరీరంలా కృంగి కృశించిపోయే దశకు చేరుకుందని మీరు బల్లకింద చెయ్యిపెట్టి గట్టిగా కొడుతూ చెప్పినట్టయితే-

నేను మీ మాటల్ని ఖండించగలను! మీరు చెప్పే ఆమ్యామ్యా వ్యవస్థ అస్సలు నడవటం లేదని చెప్పగలను!

ఒకవేళ మీ వాదన నిజమైతే - నేనిప్పుడు చెప్పేవి జరగాలి! అవునా? ఎలాగంటారా? అయితే చిత్తగించండి!..."

* * *

చెన్నై నుండి ముంబాయి వెళ్ళే దాదర్ ఎక్స్‌ప్రెస్ గుంతకల్లు స్టేషన్‌ని సమీపిస్తుండగా - అప్పలరాజుకి మెలుకువ వచ్చింది. కళ్ళు విప్పి కింది బెర్తులో ఉన్న తోటి ప్రయాణికుడ్ని చూసి "సుబ్బారావుగారూ?" పిలిచాడు. సదరు సుబ్బారావు ఆశ్చర్యంతో లేచి నిలబడి "అదేంటి సార్ - మీకు నా పేరెలా తెలుసు?"

అప్పలరాజు నవ్వేసి "తెలుగు ఫేసు కదా - గెస్ చేశా! ఇంతకీ ఇదే ఊరు?" కిటికీలోంచి బైటికి చూస్తూ ప్రశ్నించాడు.

సుబ్బారావు తేరుకుని "గుంతకల్లొస్తోంది సార్!" అన్నాడు.

వెంటనే అప్పలరాజు పై బెర్తు మీది నుంచి దబ్బుమని క్రిందికి దూకి

"వ్వాట్" అరిచాడు గట్టిగా!

ఆ అరుపుకి సుబ్బారావు ఝడుసుకుని "నిజంసార్! గుంతకల్లు వస్తోంది" భయంగా అన్నాడు.

"మైగాడ్! ఇదేమిటి?" అప్పలరాజు పరిసర ప్రాంతాల్ని పరికిస్తూ ఆందోళనగా అన్నాడు.

" ఏంటిసార్! మీరు ముందు స్టేషన్లో దిగాలన్న సంగతి మర్చిపోయారా?"

"ఛీఛీ కాదు! ఈ ట్రైన్ గుంతకల్లు కెందుకొ స్తోందానని డౌటొచ్చింది! ఇంతకుముందు చాలాసార్లు చెన్నై నుండి హైద్రాబాద్ వెళ్ళాను. అప్పుడెప్పుడూ రాని గుంతకల్లు ఇప్పుడెలా వస్తోందానని ఆశ్చర్యం... అంతే!"

సుబ్బారావు నవ్వుతూ "భలే వాళ్ళే సార్! ఈ ట్రైన్ హైద్రాబాద్ వెళ్ళదు! ముంబాయికి వెళ్తుంది!" చెప్పాడు.

"వ్వాట్!" అప్పలరాజు మళ్ళీ గట్టిగా అరిచాడు.

"వ్వాట్ సిక్స్‌టీనైన్ డౌన్ సార్! ఇది దాదర్ ఎక్స్‌ప్రెస్!" సుబ్బారావు నవ్వుతూ చెప్తుంటే అప్పలరాజు లబోదిబోమంటూ "వార్నాయినోయ్! చెన్నైలో టిటిఇ ఎక్స్‌ట్రా డబ్బులు దొబ్బి మరీ రిజర్వేషన్ టికెట్ చేతిలో పెట్టాడు. పోర్టర్ దగ్గరుండి మరీ ఈ ట్రైన్ ఎక్కించాడు కదయ్యా! నేను హైద్రాబాద్ వెళ్ళి తీరాలి! యమా అర్జెంట్..."

అంటూ చెయిన్ పట్టుకుని గాలిలో వ్రేలాడ సాగాడు. ట్రైన్ పంట చేల మధ్యలో ఆగింది.



"అదేంటిసార్! ఈ పొలాల్లో దిగిపోతారా?" సుబ్బారావుకి డౌటొచ్చింది..

"కాదు! తిన్నగా డ్రైవర్ దగ్గరకెళ్ళి ఈ ట్రైన్‌ని హైద్రాబాద్‌కి తీసుకుపొమ్మని రిక్వెస్ట్ చేస్తాను!"

అప్పల్రాజు సీరియస్‌గా చెబుతుంటే

"ఈ ట్రైన్‌ని హైద్రాబాద్‌కా?" సుబ్బారావు నోరు రెండుగా తెరిచి ప్రశ్నించాడు.

అప్పల్రాజు జవాబివ్వకుండా ట్రైన్ దిగి తిన్నగా నడుచుకుంటూ వెళ్ళి ఇంజన్ ఎక్కేశాడు. చేష్టలుడిగినవాడిలా సుబ్బారావు కూడా అతని వెంట వెళ్ళాడు.

ఎందుకని ట్రైన్ అంత సడెన్‌గా ఆగి పోయిందో ఎవ్వరికీ అర్థం కాలేదు. కొందరు జనం దిగి చర్చించుకోవడం మొదలెట్టారు.

అప్పల్రాజు డ్రైవర్ దగ్గరకెళ్ళి "ఏం డ్రైవర్‌వయ్యా నువ్వు! రూటు సరిగ్గా తెలుసుకోకుండానే బండి నడుపుతున్నావు!" విసుగ్గా అన్నాడు.

రెస్టు అనేది లేకుండా అసలే వారం రోజులుగా డ్యూటీ చేస్తున్న డ్రైవరు నిర్ఘాంతపోయి "ఏమయింది సార్?" ప్రశ్నించాడు.

"ఇంకా ఏంటి అయ్యేది? బండిని హైదరాబాద్‌కి తీసుకుపోకుండా ముంబాయి రూట్లో పట్టుకుపోతున్నావు?" గట్టిగా అరిచాడు.

డ్రైవర్‌కి మతిపోయింది. ఏం చెప్పాలో, చెయ్యాలో అర్థంగాక మొహం వేలాడేసి "ఇప్పుడేం చేద్దాం సార్?" బేలగా అన్నాడు.

అప్పల్రాజు ఉత్సాహంగా "మరేం పర్లేదు! ఇప్పటికైనా మించిపోయింది లేదు! గుంతకల్లులో రైట్ టర్న్ తీసుకుని హైద్రాబాద్ వెళ్ళిపోదాం - ఏమంటావు?" జేబులో డబ్బుపెట్టి చెప్పేసరికి డ్రైవరు కూడా సరేనంటూ బండిని మళ్ళీ స్టార్ట్ చేశాడు.

ట్రైన్ ఉన్నట్టుండి బయలుదేరటంతో విషయం తెలీని ప్రయాణీకులంతా బిలబిలమని ఎక్కేశారు. ఇంజన్ క్యాబిన్‌లో కొయ్యబారి చూస్తున్న సుబ్బారావు ట్రైన్ కదిలేసరికి కాస్త చలనం వచ్చి, తేరుకుని "డ్రైవర్ రాముడూ!" గట్టిగా అరిచాడు. అసలే కంగార్లో ఉన్న డ్రైవరు ఉలిక్కిపడి "నా పేరు... నా పేరు మీకెలా తెల్సు సార్?" అమాయకంగా అడిగాడు.

సుబ్బారావు సీరియస్‌గా చూసి "కంగారొద్దు! ఊహించాను!" చెప్పేసి మళ్ళీ "అసలు విషయమేమిటంటే ఈ అప్పల్రాజు మాటను నిజమేననుకుని బండిని కాస్తా హైద్రాబాద్‌కి

తీసుకుపోయేవు! వద్దు సుమా! మనం వెళ్ళాల్సింది ముంబాయికి!" గబగబా చెప్పాడు.

డ్రైవర్ రాముడు తలగోక్కుంటూ " ఇంతకీ నేనే రూట్లో వెళ్తున్నాను?" అయోమయంగా గొణిగాడు.

అప్పల్రాజు వెంటనే కల్పించుకుని "మనం కరెక్ట్ రూటులోనే వెళ్తున్నాం! ఇదిగో- ఈ సుబ్బారావ్ ముంబాయికని బయలుదేరి పొరబాటుగా ఈ రైలెక్కాడు. ఏం సుబ్బారావ్?" అంటూ చిలిపిగా కన్నుగీటాడు.

సుబ్బారావ్ లబోదిబోమంటూ "అన్యాయం! అక్రమం! రేప్పొద్దున్నే నేను కువైట్ వెళ్ళే విమానాన్ని బొంబాయిలో అందుకోవాలి! సార్ – నా జీవితాన్ని అన్యాయం చెయ్యకండి సార్!"

గగ్గోలు పెట్టాడు.

"వర్రీ అవకు సుబ్రావ్! కువైట్ వెళ్ళాలనుకుంటే హైద్రాబాద్ నుంచి కూడా వెళ్ళొచ్చు!"

కూల్గా అప్పల్రాజు చెబుతుంటే వింతగా చూస్తూ "వద్దు సార్! నేను ముంబాయిలోనే ఫ్లైట్ ఎక్కుతాను సార్!" సుబ్రావ్ వాపోయాడు.

" ఇగో సుబ్రావ్–ముంబాయిలో గనుక ఎక్కితే నీతోపాటు దావూద్ ఇబ్రహీం, ఛోటారాజన్లు కూడా ఎక్కే ప్రమాదం ఉంది! వీళ్ళిద్దరూ ఎప్పుడు ఫ్లైట్ ఎక్కుతారా, ఎప్పుడు హైజాక్ చేద్దామా అని బోలెడన్ని గ్యాంగులు కాచుకుని ఉన్నాయి! నా మాట విని చక్కగా హైద్రాబాద్లోనే ఫ్లైట్ ఎక్కు! లేకపోతే – నువ్వు కువైట్ చేరే సంగతి దేవుడెరుగు నిన్ను, నీ విమానాన్ని ఏ ఇథోపియాలోనో, సొమాలియాలోనో దించేస్తారు. ఫుడ్డు, బెడ్డు లేక చచ్చూరుకుంటావు!"

అప్పల్రాజు లాజికల్ థింకింగు సుబ్బారావుకి తెగ నచ్చింది. అసలు ముందే తాను ఈ విధంగా ప్లాన్ చేసుకుని వుండాల్సిందని గట్టిగా అనుకుని

"సరే అయితే – మనం హైద్రాబాద్ వెళదాం!" అన్నాడు ఉత్సాహంగా!

సుబ్బారావ్ హుషారు చూసి డ్రైవర్ రాముడికి అనుమానం వచ్చింది. వెంటనే అప్పల్రాజుకి అది అర్థమైపోయి జేబులోంచి నోట్ల కట్ట తీసి చూపాడు.

రాముడు బిత్తరపోయి "వద్దు సార్! తప్పుసార్..." గుటకలు మింగాడు.

"మరేం పర్లేదు! అయినా నీ డ్యూటీ ఏమిటి? అందర్నీ గమ్యం చేర్చటం! అవునా?"

"అవుననుకోండి... కానీ.." రాముడు అంటుంటే అప్పల్రాజు కొన్ని నోట్లు అతని ప్యాంటులోకి జారుస్తూ "కానీలు అర్ధణాలు వద్దు రాముడూ! అసలు గమ్యం ఏది అనే పట్టింపు నీకెందుకయ్యా!" చెప్పాడు మెల్లిగా!

"నిజమేననుకోండి... కానీ..." రాముడు మళ్ళీ అలా అనేసరికి ఈసారి అప్పల్రాజు సీరియస్గా "చూడు రాముడూ! నువ్వు నేను నిమిత్తమాత్రులం! నడిపేది, నడిపించేది ఆపైవాడు! కాదంటావా?" అంటూ మరిన్ని నోట్లు అతని జేబులో కుక్కాడు.

రాముడు నవ్వు మొహం పెట్టి "బండిని రేప్పొద్దున్నకల్లా మీ గమ్యం చేర్చేస్తాను!

కానీ... కానీ! "నసిగాడు. అప్పల్రాజు మొత్తం డబ్బు అతని జేబులో కుక్కి " ఇక కానీ అనకు!" అన్నాడు గట్టిగా!

"అది కాద్సార్! గుంతకల్లులో మనం రైట్ టర్నింగ్ తీసుకోవాలీ అంటే క్యాబిన్ ఆపరేటర్ చెలమయ్య మనకి సహకరించాలి కదా సార్!"

రాముడి సందేహం విన్న సుబ్బారావు "నీ ధర్మం నువ్వు నెరవేర్చు! తక్కినదంతా అప్పల్రాజుగారే చూసుకుంటారు!" గంభీరంగా డైలాగ్ కొట్టాడు.

రాముడు ఉత్సాహంగా ట్రైన్ని గుంతకల్లు స్టేషన్లోకి తీసుకొచ్చాడు.

గుంతకల్లు అవుటర్ క్యాబిన్లో చెలమయ్య పేపర్ చదువుతున్నాడు.

ఆ పేపర్ని అతను గత నెలరోజులుగా వీలయినప్పుడల్లా చదువుతూనే ఉన్నాడు.

చదివాక ఆశ్చర్యంతో తలమునకలవుతున్నాడు.

ఇంతకీ ఆ పేపర్లో – కాందహార్ విమానాన్ని దారి మళ్ళించిన వైనాన్ని సవివరంగా వివరించారు! చెలమయ్య అలా ఆ విషయం చదువుతుండగానే అప్పల్రాజు, సుబ్రావ్ లిద్దరూ క్యాబిన్లోకి దూసుకొచ్చారు.

"చూడు చెలమయ్యా –" అప్పల్రాజు విషయం చెప్పేలోగానే చెలమయ్య అడ్డుకుంటూ "అది

కాద్సార్! విమానం ఎగిరేది గాలిలో కదా - దానికో దారంటూ సపరేట్‌గా ఉండేది కాదుకదా - అట్టాంటప్పుడు విమానం దారి మళ్ళించడం ఎట్టా కుదురుతాదో మీరే చెప్పండి సార్!" గుక్కతిప్పుకోకుండా ప్రశ్నించాడు.

అప్పల్రాజు తేరుకుని, నవ్వేస్తూ "నీకున్నంత తెలివి పౌర విమానయాన సంస్థకి లేదయ్యా!" అన్నాడు ఉబ్బేస్తూ!

"అవున్నిజ్జం సార్! ఈ మాట మావోళ్ళూ అంటారు!"

"నేను అంటున్నాగా - ఆ విమానం నడిపిన పైలెట్ కంటే నువ్వే నయం!"

"అవున్సార్! ఆ రోజున నాకేగాని ఆ అవకాశమొస్తేనా? నేనేగాని అక్కడ ఉంటేనా?..." అంటూ ఏదో చెప్పబోయి అప్పల్రాజు చేతిలోని నోట్లకట్ట చూసి ఆగిపోయాడు.

" ఊ.. చెప్పూ.." అప్పల్రాజు రెట్టించాడు.

"అబ్బే-మరేవీ లేద్సార్-దారి మళ్ళించడమంటే నాకు భలే సరదాసార్"

"మరి నీకో అవకాశమిస్తాను. దారి మళ్ళిస్తావా?"

"తప్పకుండా సార్! చెప్పండి సార్!"

"చూడు చెలమయ్యా! దారే లేని ఆకాశంలో విమానాలని దారి మళ్ళించడమేమిటన్న నీ పాయింటు మహా మహత్తరం! అందులో డౌటులేదు. కానీ ముందు నువ్వు ఓ పని చెయ్యాలి!"

" ఏంటిసార్ - ఆ పని?"

"ముందు నువ్వు రైళ్ళని దారి మళ్ళించడం ప్రారంభించాలి!"

"సార్!!" నమ్మలేనట్టు చూశాడు.

"అవును చెలమయ్యా! భూమిమీద ఇప్పుడు స్టేషన్లో ఆగివున్న ట్రైన్‌ని దారి మళ్ళించు! దీన్ని నేర్చుకున్నావంటే నువ్వూ ఏదో ఒకరోజు పైలెట్ అయిపోయి గాలిలో విమానాలని చాలా తేలికగా దారి మళ్ళించగలవు.

అప్పల్రాజు నమ్మకంగా చెప్పాడు. చెలమయ్య ఆలోచనలు కాస్సేపు ఆకాశంలో విహరించాక

"కానీ... కానీ ఆకాశంలో దారులు..." సందేహంగా చెప్పబోతుంటే అప్పల్రాజు గట్టిగా అడ్డుకుంటూ "నువ్వు ముందు నేలమీద నడిచే బళ్ళని దారి మళ్ళిస్తే గానీ ఆకాశంలో విమానాలెలా దారి మళ్ళుతాయో పూర్తిగా అర్థంకాదు!" అంటూ రెండు నోట్ల కట్టలు జేబులో కుక్కాడు.

ట్రైన్ గుంతకల్లులో బయలుదేరి అవుటర్లోకి వచ్చాక హైద్రాబాద్ లైన్ వైపుకి తిరిగింది.

చెలమయ్య ఆ దృశ్యం చూసి "నేనూ దారి మళ్ళించాను!" సిగ్నల్ రాడ్ పట్టుకుని నవ్వుతూ గంతులు వేశాడు.

బాగా రాత్రి కావడంతో ప్రయాణీకులంతా నిద్దర్లో మునిగిపోయారు. తెల్లవారింది! ముంబాయి చేరాల్సిన దాదర్ ఎక్స్‌ప్రెస్ హైద్రాబాద్‌లో స్టేషన్‌లోకి దూసుకుని వచ్చి ఆగింది!

అనౌన్సరు యధావిధిగా అన్ని భాషల్లో ఆ విషయాన్ని మైక్‌లో ప్రకటన ఇచ్చింది! స్టేషన్‌లోని జనాలందరూ ఒక్కసారిగా ఉలిక్కిపడి ఒకరిమొహాలు ఒకరు చూసుకున్నారు. ఊరు చేరుకున్న సందట్లో ట్రైన్‌లోని వాళ్ళంతా పక్కలు దులుపుకుని సామాన్లు సర్దుకుని బండిదిగి చూస్తే 'హైద్రాబాద్' అన్న అక్షరాలు కనిపించాయి.

వెర్రికేక పెడుతూ కొందరు వెనక్కి విరుచుకు పడిపోయారు. శివాలెత్తినట్టు కొందరు గట్టిగా కేకలు వేశారు.

ఒక అధికారి గుంతకల్లు జంక్షన్‌కి ఫోన్ చేస్తే, చెలమయ్య లైన్‌లోకొచ్చి "ముంబాయి వెళ్ళే దారిలో దాదర్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పే ప్రమాదం ఉందనిపించి బండిని దారి మళ్ళించాను!" గట్టిగా సమర్థించుకున్నాడు!

క్షణంలో ఈ వార్త దావానలంలా వ్యాపించి పత్రికల వాళ్ళు, ఛానెళ్ళ వాళ్ళు స్టేషన్‌లోకి పరుగెత్తుకొచ్చారు. వాళ్ళకి డ్రైవర్ రాముడు ఇంటర్వ్యూ ఇస్తూ "ముంబాయి ట్రైను హైద్రాబాద్‌కి వచ్చిందంటే తప్పు నాది కాదు! పట్టాలెటు తిరిగుంటే ట్రైన్ అట్లా నడిచి వెళ్తుంది! నాకేం తెలుసు? నడపటమే నా ఉద్యోగ ధర్మం!"

నిర్భయంగా చెప్పసాగాడు.

ఇదే అదనుగా టూరిజం డిపార్టుమెంటు

వాళ్ళు మ్యూజియం చూద్దామని వచ్చిన టూరిస్టుల్ని స్టేషన్లోకి దారి మళ్ళించి, ఆగి వున్న ముంబాయి ట్రైన్‌ని, పిచ్చెక్కి ఆదుర్దాగా అటూ ఇటూ పరుగెత్తుతున్న జనాల్ని చూపసాగారు.

అప్పల్రాజు, సుబ్బారావులిద్దరూ నవ్వుకుంటూ బైటికొస్తుండగా టిసి ఎదురయ్యాడు. అప్పల్రాజు చెన్నై హైద్రాబాద్ టిక్కెట్ ఇచ్చేసి నవ్వుతూ బైటపడ్డాడు.

సుబ్బారావు అప్పల్రాజుతో " ఇంతడబ్బు లంచం ఇచ్చి ట్రైన్‌ని దారి మళ్ళించారే – ఎందుకు సార్?" ఆశ్చర్యంగా అడిగాడు.

అప్పల్రాజు రహస్యం చెప్తున్నట్టు మెల్లిగా "చూడు సుబ్బారావ్ – నేను ఈరోజే పెద్ద టెండర్ బిడ్డింగ్ వేస్తున్నా – నా ప్రత్యర్థులు నన్ను అడ్డుకోవటానికి, చంపటానికి అవకాశం ఉంది. వాళ్ళ కన్నుగప్పి ఇలా సామాన్యుడిలా ట్రైన్‌లో వస్తున్నా! నేనో పెద్ద ఫ్యాక్షన్ లీడర్ని!" చెప్తుండగానే రెండు కార్లు వాళ్ళ దగ్గరికి వచ్చేయి. అప్పల్రాజు వెంటనే ఒక కారులో కూర్చుని సుబ్బారావుకి బై చెప్పాడు.

సుబ్బారావు ఆశ్చర్యంగా నోరు తెరిచాడు. ఇంతలోనే స్టేషన్ లోపల్నించి మైక్‌లో అనౌన్స్‌మెంట్–

"ప్రయాణీకులకి ముఖ్య విజ్ఞప్తి! ముంబాయి చేరాల్సిన దాదర్ ఎక్స్‌ప్రెస్ హైద్రాబాద్ చేరలేదని చెప్పటానికి సంతోషిస్తున్నాం! షరా మామూలుగానే చెన్నై నుండి బయలుదేరాల్సిన ట్రైన్ సకాలంలో హైద్రాబాద్‌కి చేరింది! నిజానికి ట్రైన్ పేరు, నెంబర్ని ఎవరో దుండగులు చెన్నై స్టేషన్‌లోనే తారుమారు చేశారని ప్రాథమిక దర్యాప్తులో తేలింది! ఇక – ముంబాయి ట్రైన్ అనుకుని హైద్రాబాద్ ట్రైన్ ఎక్కి పొరబాటుగా ఇక్కడికి వచ్చిన వాళ్ళంతా ఇప్పుడు తిరిగి వెనక్కి వెళ్ళాలనుకుంటే మళ్ళీ క్యూల్లో నిలబడి డబ్బులు కడితే ఫ్రెష్‌గా టిక్కెట్లిస్తారు. స్పెషల్ ట్రైన్‌లో ముంబాయికి ఈసారి ఖచ్చితంగా చేరుస్తారు!"

ఇది వింటున్న జనాలంతా కంగారుగా కేకలు, అరుపులు, పెడబొబ్బలు, హాహాకారాలు చేస్తూ స్టేషన్‌లో తిరుగసాగారు.

* * *

"ఊ!! ఇప్పుడు చెప్పండి! ఇలా ట్రైన్స్‌ని మధ్యలోనే లంచలిచ్చి హైజాక్‌లు చేసి దారి మళ్ళించిన సంఘటన ఎప్పుడైనా మన దేశంలో జరిగిందా?

"లేదు! అంటే అర్థం ఏమిటి? మన దేశంలో అవినీతి లేదు అనే కదా! ఈ విషయం బాగా రుజువయింది కదా! కనీసం ఇకనైనా మీరు మీ పేపర్లో వాస్తవాలు రాయాలి! అవినీతి లేదనే చెప్పాలి! రాజకీయ నాయకులు, కంట్రాక్టర్లు అవినీతికి పాల్పడుతున్నారని రాయకూడదు! సరేనా?"

సీరియస్‌గా నా పని నేను చేసుకుంటుంటే, నన్ను ఇబ్బంది పెడుతూ ఎడిటర్ కేబిన్‌లోకి దూసుకొచ్చి ఈ కథంతా చెప్పుకొచ్చాడు! ఎవరూ... పేరేమిటి అన్న సందేహాలొద్దు! సౌలభ్యానికి ఓ పెద్దమనిషి అనుకుంటే సరి! నేను నర్మగర్భంగా నవ్వేసి "సరే! ఇకపై మా పేపర్లో అవినీతి ఎక్కడుందని ప్రశ్నిస్తూ గట్టిగా రాస్తాను!" హామీ ఇచ్చాను.

అయినా వదలకుండా "వెంటనే మొదలెట్టాలి!" గొంతుమీద కూర్చున్నాడు.

అతని వాలకం చూస్తుంటే దేశంలో ఎక్కడా అవినీతి లేదు అని దబాయించటానికి ఇలాంటి తమాషా ఉదాహరణలు మరిన్ని తయారుచేసుకుని వచ్చినట్టు అర్థమవుతూంది!

ఇలాంటి వాళ్ళ గురించి వ్యంగ్యంగా వాతలు పెట్టి మరీ రాయాలి. "సరేనండి! మీరు చెప్పిన సంఘటనను ఉటంకిస్తూ దేశంలో అవినీతి లేదనటానికి ఈ ఉదాహరణ చాలని రాస్తాను! సరేనా?" చెప్పి శీర్షిక పేరు రాశాను.

నా భావం గ్రహించకుండా పేరు చదివి

"మాబోటి పెద్ద వాళ్ళ ప్రయోజనాల్ని మీరు కలకాలం కాపాడాలి!"

చెప్పి వెళ్ళిపోయాడు.

ఇంతకీ నేను రాసిన పేరేమిటో ప్రత్యేకించి మళ్ళీ చెప్పాలా?

అవసరంలేదు! విజ్ఞులయిన పాఠకులంతా మరోసారి కథ టైటిల్ చదువుతారు!! ○